

స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం

- పీఎంకే, బీజేపీ సభ్యుల గైర్హాజరు
- ఓపీఎస్ వర్గం, సెంగోటయ్యన్ మద్దతు
- వ్యతిరేకంగా 154 ఓట్లు, అనుకూలంగా 63 ఓట్లు



చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభలో స్పీకర్ అప్పావుపై ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. శాసనసభలో అన్నాడీఎంకే సభ్యులను మాట్లాడేందుకు అనుమతించడం లేదని, ఒకే వేళ మాట్లాడినా స్పీకర్ పదే పదే జోక్యం చేసుకుని అడ్డుకుంటున్నారని, స్పీకర్ పాలక పక్షం పక్షపాతిగా వ్యవహరిస్తున్నారంటూ అవిశ్వాస తీర్మానాన్ని అన్నాడీఎంకే ప్రతిపాదించింది. ఆ తీర్మానానికి 63 మంది మద్దతు ప్రకటించగా, 154 మంది శాసనసభ్యులు వ్యతిరేకించారు. దీనితో అన్నాడీఎంకే ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి ప్రకటించారు. అవిశ్వాసతీర్మానానికి మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం, ఆయన అనుచరులు, గతరెండు నెలలుగా పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్న అన్నాడీఎంకే సీనియర్ సభ్యుడు సెంగోటయ్యన్ మద్దతు ప్రకటించటం విశేషం. ఓటింగ్‌లో బీజేపీ, పీఎంకే శాసనసభ్యులు పాల్గొనలేదు. ఆర్థిక, వ్యవసాయ బడ్జెట్‌లను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆ బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చలు జరిపే నిమిత్తం సోమవారం శాసనసభ సమావేశాలు మళ్ళీ ప్రారంభమయ్యాయి. తొలుత మాజీ శాసనసభ్యులు పీఆర్ సుందరం, ఎం.గోవిందరాజులు, గుణశీలన్, నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ చెరియన్ మృతికి స్పీకర్ అప్పావు సభలో సంతాపతీర్మానాన్ని చదివారు. ఆ తర్వాత ప్రశ్నోత్తరాల సమయం కొనసాగింది. ఆ తరువాతే స్పీకర్ అప్పావుపై అన్నాడీఎంకే ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై చర్చ ప్రారంభమైంది. ముందుగా శాసనసభ నియమ నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానంపై చర్చ ఓటింగ్ జరగాలంటే 35 శాసనసభ్యుల మద్దతు అవసరమని స్పీకర్ అప్పావు పేర్కొన్నారు.

మూజువాణి ఓటుతో వీగిన అవిశ్వాసం...

చివరగా అవిశ్వాస తీర్మానంపై మూజువాణీ ఓటింగ్ నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి మూజువాణీ ఓటింగ్ ప్రకారం తీర్మానం వీగిపోయిందని ప్రకటించారు. అయితే ఈ తీర్మానంపై డివిజన్ల వారీగా ఓటింగ్ జరపాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు. ఆ తర్వాత శాసనసభ తలుపులను మూసివేసిన తర్వాత శాసనసభ కార్యదర్శి శీనివాసన్ స్వీయ పర్యవేక్షణలో సిబ్బంది తీర్మానానికి మద్దతు పలికినవారి సంఖ్యను, వ్యతిరేకించిన వారి సంఖ్య లెక్కగట్టారు. చివరగా అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా 154 ఓట్లు, మద్దతుగా 63 ఓట్లు లభించాయని ప్రకటించారు. దీనితో అవిశ్వాసతీర్మానం తిరస్కరణకు గురైనట్లు డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి తెలిపారు. అవిశ్వాసతీర్మానం వీగిపోయినట్లు ప్రకటించిన తరువాత స్పీకర్ అప్పావు మళ్ళీ సభలో ప్రవేశించారు.

ఆ సమయంలో ఈ తీర్మానానికి మద్దతుగా అన్నాడీఎంకే శాసనసభ్యులే కాకుండా మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, ఆయన వర్గానికి చెందిన శాసనసభ్యులు, సెంగోటయ్యన్ లేచి నిల్చున్నారు. దీంతో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టమని స్పీకర్ అప్పావు ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామికి తెలిపి సభ నుండి నిష్క్రమించారు. ఆ తర్వాత డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి సభా వ్యవహారాలను నడిపించారు. తొలుత ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) స్పీకర్ అప్పావు వ్యవహార ధోరణిని తప్పుపడుతూ పలు ఆరోపణలు చేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈపీఎస్ ఆరోపణలు ఖండిస్తూ స్పీకర్‌కు అప్పావుకు మద్దతుగా ప్రసంగించారు.

స్పీకర్ పక్షపాతి

ప్రతిపక్షాలను మాట్లాడనివ్వడం లేదు

- ఈపీఎస్ ఆరోపణ



అసెంబ్లీ బయట మీడియాతో మాట్లాడుతున్న ఈపీఎస్

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అన్ని పక్షాల సభ్యులను సమానంగా చూడాల్సిన శాసనసభ స్పీకర్ అప్పావు ప్రజా సమస్యలను సభ దృష్టికి తెచ్చి మాట్లాడేందుకు ప్రతిపక్ష సభ్యులకు తగిన సమయాన్ని కేటాయించడం లేదని అన్నాడీఎంకే సభాపక్ష నాయకుడు ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆరోపించారు. ముందుగా స్పీకర్ అప్పావుపై అవిశ్వాస తీర్మానాన్ని అన్నాడీఎంకే ఉపాధ్యక్షుడు ఆర్బీ ఉదయకుమార్ ప్రతిపాదించగా, ఎస్పీ వేలుమణి బలపరిచారు. ఆ తర్వాత ఈపీఎస్ మాట్లాడుతూ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో యేడాదికి వంద రోజులు శాసనసభ సమావేశాలు జరుపుతామని డీఎంకే హామీ ఇచ్చిందని, ఆ మేరకు గత నాలుగేళ్లలో 400 రోజులు సమావేశాలు జరిగి ఉండాలని, అయితే ఇప్పటివరకూ 116 రోజులు మాత్రమే చేశారని ఆరోపించారు. ఒకే రోజు నాలుగైదు శాఖలకు సంబంధించిన పద్దులపై చర్చలు జరిపేందుకు అనుమతిస్తున్నారని, ప్రతిపక్ష సభ్యులు మాట్లాడేందుకు తక్కువ సమయమే కేటాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రధాన ప్రతిపక్ష నేత అయిన తన ప్రసంగాన్ని కూడా ప్రత్యక్ష ప్రసారం చేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఈపీఎస్ మాట్లాడుతూ గతంలో శాసనసభలో జరిగిన కొన్ని విషయాలను ప్రస్తావించినప్పుడు మంత్రి ఈవీ వేలు అడ్డుకున్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ లేచి పాత సంగతులపై చర్చలు అవసరమా? అని ఈపీఎస్‌ను ప్రశ్నించారు. వెంటనే ఈపీఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే స్పీకర్ అడ్డుకోవటం భావ్యమేనా అని ప్రశ్నించారు.

శాసనసభలో అవిశ్వాసతీర్మానం వీగిపోయిన దరిమిలా ఈపీఎస్ అసెంబ్లీ వెలుపల విలేఖరులతో మాట్లాడుతూ స్పీకర్ అప్పావుపై అవిశ్వాసతీర్మానం ప్రతిపాదించి తాను చేసిన ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయలేదని ఆరోపించారు. సభలో మంత్రులు బదులివ్వాల్సిన ప్రశ్నలకు స్పీకర్ అప్పావే బదులివ్వటం భావ్యమేనా అని ఈపీఎస్ ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్షాలకు 2గంటల 52 నిమిషాలు కేటాయించినట్లు స్పీకర్ చెబుతున్నారని, వీడియోలను పరిశీలిస్తే అందులో సగం కూడా లేదని ఈపీఎస్ అన్నారు.

లేదు... నిష్పక్షపాతంగానే వ్యవహరిస్తున్నారు

- ఈపీఎస్ వ్యాఖ్యలను ఖండించిన సీఎం స్టాలిన్



అసెంబ్లీలో స్పీకర్ అప్పావుకు మద్దతుగా ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ప్రతిపక్ష నేత ఈపీఎస్ ఆరోపిస్తున్నట్లు స్పీకర్ అప్పావు పాలక పక్షానికి మద్దతుగా ఏనాడు వ్యవహరించలేదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. స్పీకర్‌పై ఈపీఎస్ చేసిన ఆరోపణలు ఖండిస్తూ శాసనసభలో ఆయన ప్రసంగించారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయినవారే ఈ రకం అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడతారని. అన్నాడీఎంకే పార్టీలో చెలరేగుతున్న అసమ్మతిపై ప్రజల దృష్టిపడకుండా ఈపీఎస్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టార న్నారు. స్పీకర్ సభలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆధారాలతో సహా ప్రకటించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. స్పీకర్ అప్పావు ఎవరి మనస్సు నొప్పించకుండా వ్యహరిస్తారని, రాజకీయాల్లో రాకముందుకు ఉపాధ్యాయుడిగా పనిచేశారని తెలిపారు. ఓ వైపు మృదుస్వభావిగా ఉంటూనే సభా నిర్వహణలో నికచ్చిగా వ్యవహరించడం అప్పావు నైజమన్నారు. అవిశ్వాసతీర్మానం ప్రవేశపెట్టిన అన్నాడీఎంకే సభ్యులు స్పీకర్ అప్పావుతో కనుసైగలతోనే మాట్లాడిన దృశ్యాలను తాను స్వయంగా చూశానని చెప్పారు. పాలకపక్షం సభ్యులకంటే ప్రతిపక్ష సభ్యులే అప్పావుతో సఖ్యతగా మెలగుతుంటారని, సభ జరుగుతున్నప్పుడు కూడా ఆయన వద్దకు వెళ్ళి చనువుగా మాట్లాడుతుంటారని స్టాలిన్ చెప్పారు. పాలక పక్షం సభ్యులు, మంత్రులను పలుమార్లు కట్టడి చేసిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. తాను చెప్పిన వివరాలను గమనిస్తే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని అన్నాడీఎంకే నేతలు తమ మనసాక్షికి వ్యతిరేకంగానే ప్రవేశపెట్టినట్లు గుర్తిస్తారని అన్నారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి

ధర్మేంద్ర ప్రధాన్‌కు పితృవియోగం

- సీఎం స్టాలిన్ సంతాపం

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తండ్రి, కేంద్ర మాజీ మంత్రి దేవేంద్ర ప్రధాన్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఓ సందేశం వెలువరిస్తూ పితృ వియోగంతో బాధపడుతున్న ధర్మేంద్ర ప్రధాన్, ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ బాధను తట్టుకుని త్వరగా శోకవిముక్తులు కావాలని ఆకాంక్షిస్తున్న స్టాలిన్ ఆ సందేశంలో తెలిపారు.

'తమిళుల ఆర్థిక నిర్వహణ ప్రాశస్త్యం' పేరుతో రాష్ట్ర ఆర్థిక శాఖ రూపొందించిన పరిశోధనాత్మక గ్రంథాన్ని సచివాలయంలో ఆవిష్కరించి తొలి ప్రతిని ఆర్థికమంత్రి తంగం తెన్నరసుకు అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



టాస్మాక్ అవినీతిపై బీజేపీ పోరు

- అన్నామలై, తమిళిసై, ఎమ్మెల్యేల అరెస్ట్

పార్యీస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని టాస్మాక్ సంస్థలో రూ.1,000 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తూ నగరంలో సోమవారం ఉదయం ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, రాస్తారోకో, ధర్నాల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ అధ్యక్షురాలు తమిళిసై, ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ సహా పలువురిని అరెస్టు చేశారు. పలు జిల్లాల్లో బీజేపీ నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలు చేసే టాస్మాక్ సంస్థ, మద్యం తయారీ కర్మాగారాల్లో ఆకస్మిక తనిఖీల్లో నిర్వహించిన ఈడీ అధికారులు దాదాపు రూ.1,000 కోట్ల మేర అవినీతి జరిగిందంటూ ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఈ వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, బీజేపీ, ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం, పీఎంకే తదితర పార్టీలు టాస్మాక్ సంస్థ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో టాస్మాక్ అవినీతిని ఖండిస్తూ రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఎగ్మూర్‌లోవున్న టాస్మాక్ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు అన్నామలై ప్రకటించారు. దీంతో ఉదయం 6 గంటలకే అక్కడకు చేరుకున్న పోలీసులు టాస్మాక్ కార్యాలయం ముట్టిడికి యత్నించిన బీజేపీ సీనియర్ నేత ఎం.చక్రవర్తి, ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్, రాష్ట్ర కార్యదర్శి వినోజ్‌సెల్వం తదితరులను అరెస్టు చేశారు. అదే విధంగా సచివాలయాన్ని ముట్టడించేందుకు ఎగ్మూర్ రాజరత్నం స్టేడియం నుండి ర్యాలీగా వెళ్ళిన సుమారు వంద మంది కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. సాలిగ్రామంలోవున్న తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై ఇంటిముందు సుమారు 50మందికి పైగా పోలీసులు మోహరించారు. పోలీసులు వారిస్తున్నా లెక్కచేయని తమిళిసై పార్టీ కార్యకర్తలతో కలిసి ఎగ్మూర్‌లోని టాస్మాక్ ప్రధాన కార్యాలయానికి బయల్దేరడంతో వారిని కూడా అరెస్టు చేశారు. అదేవిధంగా పనైయూర్‌లోవున్న బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఇంటిముందు పోలీసులు మోహరించారు. ఉదయం 11.10గంటలకు ఇంటి నుంచి బయటకు వచ్చిన అన్నామలైను పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కారులో ఈసీఆర్ రోడ్డులోవున్న అక్కరై ప్రాంతానికి చేరుకున్న అన్నామలై, పార్టీశ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. కేంద్రమాజీ మంత్రి పొన్‌రాధాకృష్ణన్, సీనియర్ నేత హెచ్.రాజా, రాష్ట్ర ఉపాధ్యక్షులు కరు నాగరాజన్, వీపీ.దురైస్వామి, రాష్ట్రకార్యదర్శి కరాటే త్యాగరాజన్‌తో పాటు మహిళా కార్యకర్తలను కూడా అరెస్ట్ చేశారు. ఆందోళనాకారులను పోలీసు వాహనాల ద్వారా ఆయా ప్రాంతాల్లో వున్న ప్రభుత్వ మైదానాలు, కల్యాణమండపాలు, రాజరత్నం స్టేడియం తదితర ప్రాంతాలకు తరలించారు. అయితే అరస్టయిన వారిలో వున్న మహిళలు మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో రాష్ట్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ధర్నాలో పాల్గొన్న కేంద్ర మాజీమంత్రి పొన్ రాధాకృష్ణన్



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైని అరెస్టు చేసి వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

త్వరలో సీఎం ఇంటి ముట్టడి.. అన్నామలై

టాస్మాక్ అవినీతిని ఖండిస్తూ త్వరలోనే ముఖ్యమంత్రి స్టాలిన్ ఇంటిని ముట్టడించనున్నట్లు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. సోమవారం ఉదయం అరెస్టయిన సందర్భంగా అన్నామలై మీడియాతో మాట్లాడుతూ, టాస్మాక్ సంస్థలో రూ.1,000 కోట్లకు పైగా అవినీతి జరిగిందని ఈడీ వెల్లడించడంపై డీఎంకే ప్రభుత్వం ఇప్పటివరకు సరైన సమాధానం చెప్పలేదని వ్యాఖ్యానించారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ లాగే సీఎం స్టాలిన్ ప్రభుత్వంలో కూడా జరిగిందని, ఈ గుట్టు బయటపడుతుందనే భయంతోనే బీజేపీ నేతలను, తనను పోలీసులు అరెస్టు చేయడం ఖండించదగ్గదన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు



అరెస్టయిన ఎమ్మెల్యేలు వానతీ శ్రీనివాసన్, సరస్వతి, బీజేపీ సీనియర్ నేత ఎం.చక్రవర్తి

ఇద్దరు రౌడీల హత్య

- నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు

అడయార్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట్టూరుపురంలో ఆదివారం రాత్రి గుడిలో నిద్ర పోతున్న ఇద్దరు రౌడీలు దారుణ హత్యకు గురయ్యారు. ఈ జంట హత్య కేసుల వివరాలను పరిశీలిస్తే, కోట్టూరుపురం చిత్రా నగర్ యూ బ్లాక్‌కు చెందిన అరుణ్ (25) అనే వ్యక్తిపై వివిధ పోలీసుస్టేషన్లలో కేసులున్నాయి. ఆదివారం రాత్రి మరో రౌడీ సురేష్‌తో కలిసి మద్యం సేవించి, స్థానికంగా ఉండే ఒక గుడిలో నిద్ర పోయాడు.. ఆ సమయంలో నాలుగు బైకుల్లో వచ్చిన ఎనిమిది మంది రౌడీలు నిద్రపోతున్న వారిపై వేటకొడవళ్లతో దాడి చేసి పారిపోయారు. ఆ దాడిలో సురేష్ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, అరుణ్ ఆస్పత్రికి తరలిస్తుండగా తుదిశ్వాస విడిచాడు. ఈ జంట హత్యలపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రాథమిక విచారణ చేపట్టగా అరుణ్‌కు, అతడి పాత స్నేహితుడైన చిత్రా నగర్ వి బ్లాక్‌కు చెందిన సురేష్ అలియాస్ సుక్కుకాఫీ సురేష్ (25)కు మధ్య ఉన్న పాతకక్షల నేపథ్యంలో ఈ హత్యలు జరిగాయని నిర్ధారించారు. అరుణ్‌ను హత్య చేయాలని సుక్కుకాఫీ సురేష్ ప్లాన్ వేశాడు. గత కొంతకాలంగా అరుణ్ కదలికలను గమనించి, ఆదివారం రాత్రి అరుణ్, తన స్నేహితుడు రౌడీ సురేష్‌తో కలిసి ఒక గుడిలో నిద్రిస్తున్నట్టు తెలిసి. తన స్నేహితులతో కలిసి దాడి చేసి హత్యచేసి పారిపోయాడు. దీనిపై కోట్టూరుపురం పోలీసులు కేసు నమోదు చేసి, ఎనిమిది మంది నిందితుల కోసం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ జంట హత్యలు స్థానికంగా కలకలం సృష్టించాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (మంగళవారం సాయంత్రం)
సహర్: 4:33 (బుధవారం ఉదయం)

సమాచార దర్శిని

ఎన్సీఈటీ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్సీఈటీ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు ఈ నెల 31వ తేది వరకు పొడిగించారు. నాలుగేళ్ల టీచింగ్ డిగ్రీలో ప్రవేశానికి నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎన్సీఈటీ)లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఈ పరీక్షను జాతీయ పరీక్షా ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఎన్సీఈటీ పరీక్ష దేశవ్యాప్తంగా 178 నగరాల్లో ఏప్రిల్ 29న ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు స్వీకరణ గత నెల 20వ తేదీన ప్రారంభమై ఆదివారంతో ముగిసింది. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తితో దరఖాస్తు గడువు ఈ నెల 31వ తేది వరకు పొడిగించారు. అభ్యర్థులు https://exams.nta.ac.in/NCET/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 011-40759000 అనే నెంబరు ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా రెడ్‌హిల్స్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. దర్గాస్ రోడ్డు, బాలవినాయక నగర్, కన్నపాళయం, గోమతియమ్మన్ నగర్, సేందారంబాక్కం, సిరంగపూరు, పుదు నగర్ మూడు, ఐదు వీధులు, మల్లిమనగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

19న ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ పోటీలు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. పోటీల్లో భాగంగా చేపాక్కంలోని చిదంబరం స్టేడియంలో 23వ తేది చెన్నై సూపర్ కింగ్స్‌-ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయాలు ఈ నెల 19వ తేది ఆన్‌లైన్‌లో ప్రారంభం కానున్నాయి. ఒక వ్యక్తికి రెండు టిక్కెట్లు మాత్రమే ఇవ్వనున్నట్లు, ప్లాస్టిక్ వస్తువులను మైదానంలోకి అనుమతించమని, కారు, బైక్‌లున్న వారు, వాటిని పార్కింగ్ చేసేందుకు మ్యాచ్‌కు రెండు గంటల ముందుగా రావాలని నిర్వాహకులు సూచించారు.

'చెన్నై' అందాల ఫొటోలు పంపండి: జీసీసీ

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై అందాలను ఫొటోలు, వీడియోలుగా తీసి పంపించాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... దేశంలో కోల్‌కతా తర్వాత అందమైన నగరంగా చెన్నై పేరు పొందింది. నగరంలో చెన్నై సెంట్రల్, ఎగ్మూర్ రైల్వేస్టేషన్లు, సెయింట్ జార్జి కోట సహా సుమారు 2 వేలకు పైగా పురాతన కట్టడాలున్నాయి. నగరంలోని సాంప్రదాయ చిహ్నాల నుంచి ఆధునిక వాస్తు శిల్పాలు, ముఖ్యాంశాలు, రోజువారీ సంఘటనలను ఫొటోలు, వీడియోలుగా చిత్రీకరించి కార్పొరేషన్ వెబ్‌సైట్‌కు పంపించాలి. వాటిని ఉత్తమమైన వాటిని జీసీసీ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రతి వారం ప్రదర్శించనున్నట్లు జీసీసీ తెలిపింది.

స్కాలర్‌షిప్‌తో కూడిన వృత్తి శిక్షణకు ఆహ్వానం

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్కాలర్ షిప్‌తో కూడిన వృత్తి శిక్షణ అందించనున్నట్లు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ప్రకటించింది. ఈ మేరకు ఎంటీసీ విడుదల చేసిన ప్రకటనలో... ఎంటీసీలో 2025-26వ సంవత్సరానికి మెకానిక్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఆటో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, పెయింటర్, వెల్డర్ తదితర ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు నెలకు రూ.14,000 స్కాలర్ షిప్‌తో ఏడాది వృత్తి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఏప్రిల్ 2వ తేది ఉదయం 10 గంటలకు క్రోంపేటలోని ఎంటీసీ వృత్తి శిక్షణ పాఠశాలలో జరిగే ప్రత్యేక ఇంటర్వ్యూలో పాల్గొని దరఖాస్తులు సమర్పించాలని ఎంటీసీ తెలిపింది.

స్వయం సహాయక బృందాలకు గుర్తింపు కార్డులు

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాల సభ్యులు 54 లక్షల మందికి గుర్తింపు కార్డులు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సభ్యుల వివరాలు నెలరోజుల్లో సేకరించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలందాయి. ఈ మేరకు రాష్ట్ర మహిళల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రేయా పి.సింగ్ విడుదల చేసిన ప్రకటనలో, నగర, గ్రామీణ ప్రాంతాల్లోని పేద, సామాన్య వర్గాలకు చెందిన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా స్వయం సహాయక బృందాలు ఏర్పాటుచేశామన్నారు. స్వయం సహాయక బృందాల్లోని సభ్యులకు రెండు విడతలుగా గుర్తింపుకార్డులు ఇవ్వనున్నామన్నారు. తొలివిడతలో ప్రభుత్వ స్వయం సహాయక బృందాలు, రెండో విడతలో స్వచ్ఛంద సంస్థల స్వయం సహాయక బృందాలకు గుర్తింపు కార్డులు అందించనున్నామని తెలిపారు. ఈ కార్డులు కలిగిన సభ్యులు, ముఖ్యమంత్రి జీవిత బీమా, కో-ఆప్‌టెక్స్‌లో దుస్తుల కొనుగోళ్లకు 5 శాతం రాయితీ సహా ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

తన పోలికలు లేవని
బిడ్డను హతమార్చిన కసాయి అరెస్టు

టి.నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా మేట్టుపాళయం వద్ద తన పోలికలు లేవనే అనుమానంతో ఆడబిడ్డను దారుణంగా హతమార్చిన తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. మేట్టుపాళయంలో నివసిస్తున్న కుమారగురు, పాండిసెల్వి అనే దంపతులకు యేడాది క్రితం కవల పిల్లలు జన్మించారు. ఆడబిడ్డకు దీపాశ్రీ అని, మగబిడ్డకు దివాన్ అనే పేర్లుపెట్టారు. గత కొద్ది మాసాలుగా కుమారుగురు తన ఇద్దరు కవల పిల్లలు తనకు పుట్టలేదనే అనుమానం వ్యక్తం చేశాడు. దీంతో తరచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఇదిలా ఉండగా జ్వరంతో బాధపడుతున్న దివాన్‌ను పాండిసెల్వి ఆస్పత్రికి తీసుకెళ్లింది. ఆ సమయంలో ఇంటిలో ఉన్న కుమారుగురు కుమార్తె ఏడవడంతో చితకబాదాడు. అంతటితో ఆగకుండా బిడ్డ తలను గోడకేసి కొట్టాడు. దీంతో ఆ ఆడబిడ్డ ప్రాణాలు కోల్పోయింది. ఆస్పత్రి నుండి తిరిగొచ్చిన భార్యకు తన కుమార్తె ఉన్నట్టుండి అస్వస్థతకు గురై మరణించినట్లు చెప్పాడు. వెంటనే పాండిసెల్వి తన బిడ్డ మృతిపై అనుమానాలున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, పోలీసుల ఎదుట కుమారగురు తన నేరాన్ని అంగీకరించాడు. ఆ తర్వాత కుమారుగురును పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు.



కుమారగురును అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసు

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● టీచర్ అరెస్ట్

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్ పోక్సో చట్టం కింద కటకటాల పాలయ్యాడు. తిరునల్వేలి జిల్లా కలక్కాడు సమీపంలో ఓ ప్రాంతానికి చెందిన వ్యక్తి (54) ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన గత శనివారం 8వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని తన గదికి పిలిచి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఆయన వేధింపులు భరించలేక గది నుంచి పరుగులు తీసిన విద్యార్థిని, ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు తెలియజేసింది. తల్లిదండ్రులు ఈ వ్యవహారంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి పీఈటీని అరెస్ట్ చేశారు.

మైలం కాలేజీ గ్రౌండ్‌లో వందల యేళ్లనాటి చింతచెట్టు దగ్ధం



టి.నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మైలం ప్రాంతంలో ప్రైవేటు కళాశాల మైదానంలో సుమారు 500 సంవత్సరాల నాటి చింతచెట్టు సోమవారం వేకువజామున దగ్ధమైంది. ఆ చింతచెట్టులో చెలరేగిన మంటలను చూసి స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకుని అగ్నిమాపక దళం ఆ ప్రాంతానికి చేరుకుని పోరాడి మంటలను ఆర్పివేశారు. దుండగులెవరైనా ఆ చెట్టుకు నిప్పంటించారా అనే కోణంపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

చేపల వేటకు వెళ్లిన రామేశ్వరం జాలర్లు

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవి ఉత్సవాల సందర్భంగా విధించిన నిషేధం ఎత్తివేయడంతో వేలాది మంది రామేశ్వరం జాలర్లు చేపల వేటకు బయల్దేరి వెళ్లారు. కచ్చాదీవిలోని సెయింట్ ఆంథోని ఆలయ ఉత్సవాలు ఈ నెల 14,15 తేదీల్లో జరిగాయి. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు రామేశ్వరం నుంచి వంద పడవల్లో సుమారు 3,000 మంది భక్తులు వెళ్లారు. ఈ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని భద్రతా కారణాల రీత్యా మరపడవలు, నాటు పడవల్లో జాలర్లు చేపల వేటకు వెళ్లేందుకు నిషేధం విధించడంతో, రామేశ్వరం, పాంబన్, మండపం తదితర ప్రాంతాలకు చెందిన 1,500 పడవలు తీరంలో నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో, కచ్చాదీవి ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో, చేపల వేటపై విధించే ఎత్తివేయడంతో, సోమవారం ఉదయం జాలర్ల సంక్షేమ శాఖ అనుమతితో వేలాది మంది జాలర్లు సముద్రంలో చేపల వేటకు బయల్దేరి వెళ్లారు.

రైలులో తరలిస్తున్న రూ.13.77 లక్షలు స్వాధీనం

● వ్యాపారి అరెస్టు



అరెస్టయిన వ్యాపారి, స్వాధీనం చేసుకున్న నగదు

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తిరుక్కురళ్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎలాంటి పత్రాలు లేకుండా ఓ వ్యాపారి తరలిస్తున్న రూ.13.77 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ నుండి కన్నియాకుమారి వెళ్లే తిరుక్కురళ్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం దిండుగల్ రైల్వేస్టేషన్‌లో ఆగినప్పుడు ఆ రైలులో భారీగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో తిరుచ్చి రైల్వే ఎస్పీ రాజన్ ఆదేశాల మేరకు సీఐ తూయమణి తన బృందంతో ఆ రైలులో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఓ బోగీలో ప్రయాణిస్తున్న కన్నియాకుమారి జిల్లా కల్కుళం ప్రాంతానికి చెందిన నవనీత కృష్ణన్ అనే వ్యాపారి బ్యాగ్‌ను పోలీసులు తనిఖీ చేయగా అందులో రూ.13.77లక్షల వరకు కొత్త ఐదువందల నోట్ల కట్టలు లభించాయి. ఆ నగదుకు సంబంధించి నవనీత కృష్ణన్ వద్ద ఎలాంటి రశీదు లేకపోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఆయన వద్ద విచారణ జరిపినప్పుడు విదేశీ కరెన్సీని ఇండియన్ కరెన్సీగా మార్చే ఏజెంట్ వ్యాపారం చేస్తున్నాడని, ఇటీవల విదేశీ కరెన్సీ మార్చి ఇచ్చినందుకు వచ్చిన కమిషన్ సొమ్మును స్వస్థలానికి తీసుకెళుతున్నాని తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

ఏపీఎస్ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా

● ఇద్దరి అరెస్ట్



నిందితులు దినేష్, ఆశిష్

తిరుత్తణి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని చెన్నై-తిరుపతి జాతీయ రహదారిపై వస్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సులో 10 కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం సాయంత్రం తరుత్తణి సమీపంలోని పొన్‌బాడి అచీవ్‌మెంట్ బూత్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తిరుపతి నుంచి వస్తున్న బస్సును ఆపి పరిశీలించగా, తిరువొత్తియూర్‌కు చెందిన దినేష్ (29), రాయపురానికి చెందిన ఆశిష్ (27) అనే ఇద్దరి యువకుల దగ్గర ఉన్న 10కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీరు ఈ మాధకద్రవ్యాలను ఉత్తరాది రాష్ట్రాలనుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా చెన్నై తీసుకొచ్చి ఇక్కడ కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసు నమోదుచేసిన తిరుత్తణి పోలీసులు వీరిద్దరిని కోర్టులో హాజరుపరచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

సముద్రంలో పడవ బోల్తా: జాలరి మృతి

ప్యారీస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపలవేటకు వెళ్ళిన జాలరి పడవ బోల్తాపడిన ఘటనలో నీటమునిగి మృతిచెందినట్లు రాయపురం పోలీసులు తెలిపారు. కాశిమేడుకు చేందిన కుమార్ (60) ఆదివారం అర్థరాత్రి దాటిన తరువాత 1.30గంటలకు నాటు పడవలో కాశిమేడు ఫిషింగ్ హార్బర్ నుండి సముద్రంలో చేపలవేటకు వెళ్ళారు. ఆయన ప్రయాణం చేసిన పడవ బోల్తాపడటంతో కుమార్ నీటమునిగినట్లు ఆ ప్రాంతంలో చేపలవేటకు వెళ్లిన జాలర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బందితో సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు కుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

ఆటో చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక రెట్టేరిలో ఆటో చోరీచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెరియార్ నగర్ 3వ వీధికి చెందిన గోపి తన షేర్ ఆటోను ఈ నెల 10వ తేది రెట్టేరి సుభాష్ నగర్‌లోని మెకానిక్ దుకాణంలో సర్వీసింగ్‌కు ఇచ్చాడు. మరుసటిరోజు దుకాణానికి వచ్చిన సమయంలో ఆటో కనిపించకపోవడంతో మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణకు ఏర్పాటైన ప్రత్యేక బృందం, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ పరిశీలించి పొన్నియమ్మన్‌మేడు శివగణపతి నగర్‌కు చెందిన శ్రీనివాసన్‌ను అరెస్ట్ చేసి, ఆటో స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన శ్రీనివాసన్‌ను ఆదివారం కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

శ్రీలంకకు తరలిస్తున్న బీడి ఆకుల స్వాధీనం

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకకు తరలించేందుకు సిద్ధం చేసిన రూ. కోటి విలువైన 2.4 టన్నుల బీడి ఆకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సమీపంలోని సముద్రతీరం నుంచి శ్రీలంకకు బీడి ఆకులు అక్రమంగా తరలిస్తున్నట్లు తూత్తుకుడి క్యూ బ్రాంచ్ సీఐ విజయ్ అనితకు సమాచారం అందింది. ఆ మేరకు, ఎస్ఐ జీవమణి నేతృత్వంలో ఎస్ఎస్ఐ రామన్, హెడ్ కానిస్టేబుల్ ఇరుదయరాజ్‌కుమార్, ఇసైక్కిముత్తు, కానిస్టేబుల్ పళని బాలమురుగన్ సోమవారం తెల్లవారుజామున తిరుచెందూర్ సమీపం ఆలందలై గ్రామం వెనుక వైపు సముద్రతీరంలో తనిఖీ చేశారు. ఆ సమయంలో, ఆ ప్రాంతంలో ఉన్న వ్యాన్‌లో కటింగ్ బీడి ఆకులు 30 కిలోల చొప్పున 33 బస్తాలు (990 కిలోలు), కటింగ్ చేయని బీడి ఆకులు 49 బస్తాలు (1470 కిలోలు) మొత్తం 82 బస్తాలలో (2,460 కిలోలు) బీడి ఆకులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు యత్నించిన ముఠా పోలీసులను చూసి పడవలో తప్పించుకుని పరారయ్యారు. తప్పించుకున్న వారు వినియోగించిన రెండు మోటార్ బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని, పరారైన వారి కోసం గాలిస్తున్నారు.

24 యేళ్లు పరారీలో ఉన్న రౌడీ సేరా అరెస్టు



రౌడీ సేరా

టి.నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గత 24 యేళ్లగా పోలీసుల కళ్ళుగప్పి పరారీలో ఉన్న వ్యాసార్పాడికి చెందిన పేరు మోసిన రాజేంద్రన్ అలియాస్ సేరా (60)ను పోలీసులు అరెస్టు చేశారు. 1960 దశకంలో మయన్మార్ నుండి వలస వచ్చిన కొందరు నేరాలకు పాల్పడుతూ రౌడీలుగా చెలామణీ అయ్యారు. ఆ ప్రకారం 1970లో ఉత్తర చెన్నైలో సుబ్బయ్యా, బెంజమిన్ అనే ఇద్దరు దాదాలు నగరవాసులను, పోలీసులను గడగడలాడించారు. వీరి నాయకత్వంలో రెండు రౌడీ గ్రూపులుండేవి. ఆ రెండు గ్రూపులు పరసర్పరం దాడులకు దిగి హత్యలకు పాల్పడుతుండేవారు. ఆ రీతిలో బెంజమన్ కుడిభుజంగా వ్యవహరించిన రౌడీ వెళ్లై రవి, ఎంకేబీ నగర్‌లో దాదా సుబ్బయ్యను హతమార్చారు. దీంతో బెంజిమన్ వర్గీయులపై ప్రతీకారం తీర్చుకోవడానికి వ్యాసార్పాడికి చెందిన రాజేంద్రన్ అలియాస్ సేరా రౌడీగా రంగంలోకి దిగాడు. వెళ్లైరవి, సేరా వర్గీయులు కిడ్నాప్‌లు, ఆయుధాల స్మగ్లింగ్, కట్టపంచాయతీలు చేస్తూ నగరవాసులను భయభ్రాంతులకు గురిచేశారు. రౌడీ సేరాపై మూడు హత్య కేసులు, ఐదుకుపైగా హత్యాయత్నం కేసులు, 15కు పైగా దారిదోపడీలు తదితర కేసులు నమోదై ఉన్నాయి. వెళ్లై రవి రాజకీయ ప్రముఖుడి కిడ్నాప్ కేసులో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అదే సమయంలో అరెస్టయిన రౌడీ సేరా 2001లో జైలు నుండి పెరోల్‌పై విడుదలై పారిపోయాడు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే ఎంకే బాలన్ హత్యకేసులో అజ్ఞాతంలో ఉన్న ఉత్తర చెన్నై సోమసుందరాన్ని పోలీసులు ఆంధ్రప్రదేశ్‌లో అరెస్టు చేశారు. సోమసుందరం సేరా కుడిభుజంగా వ్యవహరించేవాడు. దీంతో అతడిని పోలీసులు తమ శైలిలో విచారించి సేరా ఆచూకీ కనుగొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పుత్తూరులో సేరా రియల్ ఎస్టేట్ వ్యాపారిగా చెలామణీ అవుతున్నాడని తెలుసుకున్నారు. ప్రత్యేక దళం పోలీసులు హుటాహుటిని అక్కడికి వెళ్ళి సేరాను అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చి సెంట్రల్ జైలుకు తరలించారు. సేరా రౌడీగా మారక ముందు పోలీస్ కానిస్టేబుల్‌గా కొంతకాలం పనిచేసి, అవినీతికి పాల్పడి డిస్మిస్ అయ్యాడు.

ఆమ్నీ వ్యాన్‌లో చెలరేగిన మంటలు



దగ్ధమవుతున్న ఆమ్నీ వ్యాన్

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్తున్న మినీ వ్యాన్‌లో హఠాత్తుగా మంటలు చెలరేగిన ఘటనలో, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. తిరుప్పూర్ జిల్లా నుంచి కరూర్ జిల్లా కుళిత్తలై జరుగనున్న శుభకార్యానికి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆమ్నీ వ్యానులో బయల్దేరారు. తేరనక్కల్‌పట్టి ప్రాంతంలో వస్తుండగా వ్యాన్ వెనుక భాగంలో పొగలు రావడం గమనించిన డ్రైవర్, వ్యాన్‌ను రోడ్డు పక్కనే ఆపాడు. అనంతరం వ్యానులోని వారు కిందకు దిగి దూరంగా పరుగులు తీశారు. అంతలో వ్యాన్ అంతా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపు చేశారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

● వరకట్న వేధింపులు....

భర్త సహా ముగ్గురిపై కేసు

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులకు పాల్పడిన భర్త సహా ముగ్గురిపై పోలీసులు కేసు నమోదుచేశారు. కడలూరు కేఎన్ పేటకు చెందిన మైఖేల్‌రాజ్‌కు రంజితతో 2021లో వివాహమైంది. వివాహం సమయంలో కట్నంగా 10 సవర్ల నగలు, గృహోపకరణాలను రంజిత తల్లిదండ్రులు ఇచ్చారు. కాగా, వివాహం ఖర్చు రూ.2 లక్షలను తల్లిదండ్రులు అడిగి తీసుకురావాలంటూ భర్త మైఖేల్‌రాజ్, ఆయన సోదరి నిత్యీషా, తండ్రి సంతోష్‌కుమార్ కలిసి వేధించడంతో తట్టుకోలేని రంజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కడలూరు మహిళా పోలీసులు, మైఖేల్ రాజ్ సహా ముగ్గురిపై ఆదివారం కేసు నమోదుచేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు అడుగుతాం!

● డీపీఐ నేత తిరుమావళవన్

ప్యారీస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో తమపార్టీకి అధికసీట్లు కేటాయించాలని డీఎంకేను కోరనున్నట్లు డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ పేర్కొన్నారు. విల్లుపురంలో ఆదివారం సాయంత్రం తిరుమావళవన్ అధ్యక్షతన జరిగిన డీపీఐ వార్షిక వేడుకల్లో డీఎంకే కూటమిలోని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, రాష్ట్రమంత్రి పొన్ముడి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, కాంగ్రెస్ నేత పీటర్ అల్ఫోన్స్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఈ సభలో తిరుమావళవన్ మాట్లాడుతూ, తాజాగా రాజకీయాల్లో ప్రవేశించిన సినీనటుడు విజయ్ వెంటవెళ్ళే యువత తమపార్టీకి అవసరం లేదన్నారు. విజయ్ పార్టీ వల్ల డీపీఐ బలం తగ్గిపోతుందని భావించడం సరికాదన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిలోవున్న తమ పార్టీకి అధిక సీట్లలో పోటీచేసేందుకు అవకాశం కల్పించాలని కోరతామని, అయితే తమ కోరిక నెరవేర్చకపోయినా కూటమి నుండి వైదొలిగే ప్రసక్తేలేదని తిరుమావళవన్ తేల్చిచెప్పారు.

సీనియర్ల బుజ్జగింపుతో అలక వీడిన సెంగోటయ్యన్

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా పార్టీ వ్యవహారాలకు, ప్రత్యేకించి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కి ముఖం చాటేసిన మాజీ మంత్రి సెంగోటయ్యన్ సీనియర్ నేతల బుజ్జగింపుతో అలకపాన్పు వీడారు. ఊహించని విధంగా అసెంబ్లీలో స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు ఈపీఎస్ దగ్గరకు వెళ్ళి సెంగోటయ్యన్ మాట్లాడారు. అవిశ్వాసతీర్మానంపై డివిజన్ల వారీగా ఓట్ల లెక్కింపు ఎలా జరుగుతుందనే విషయాన్ని ఈపీఎస్‌కు ఆయన వివరించారు. శాసనసభ సమావేశాలు ప్రారంభానికి ముందే అన్నాడీఎంకే సీనియర్ నేతలు కేపీ మునుసామి, ఎస్పీ వేలుమణి, తంగమణి తదితరులు సెంగోటయ్యన్‌ను కలిసి చర్చించారు. ఈపీఎస్‌తో ఏవైనా మనస్పర్థలు ఉంటే వాటిని తాము పరిష్కరిస్తామని, స్పీకర్‌పై ప్రవేశపెట్టనున్న అవిశ్వాసతీర్మానం సందర్భంగా పార్టీకి దూరంగా ఉండద్దని హితవు పలికారు. సుమారు అరగంటకు పైగా జరిపిన చర్చలు ఎట్టకేలకు ఫలించింది.

గంజాయి విక్రయం కేసులో నలుగురి విడుదల

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి విక్రయాల కేసుల్లో అరెస్టయిన నలుగురిని చెన్నై ప్రత్యేక కోర్టు విడుదల చేసింది. 2022లో నగరంలో గంజాయి విక్రయిస్తున్న వ్యవహారంలో శాంతి (68), ఆమె భర్త పెరుమాళ్ (70)ను పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే, అదే సంవత్సరం కొట్టూరుపురంలో గంజాయి విక్రయిస్తున్న అబిషేక్, అశ్విన్‌లను కూడా అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో, ఈ కేసు విచారణ సోమవారం జరుగగా, నేరం నిరూపణ కాలేదని పేర్కొంటూ నలుగురిని విడుదల చేస్తూ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

కుక్కకాటుకు రాబిస్ వ్యాక్సిన్ తప్పనిసరి

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుక్క కరిచిన వెంటనే రాబిస్ టీకా వేయించుకోవాలని ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ సెల్వవినాయగం విడుదల చేసిన ప్రకటనలో... కొదిరోజుల క్రితం రాణిపేట జిల్లాలో ఓ వ్యక్తిని వీధి కుక్క కరిచిందని, అతను మూడు నెలల వరకు రాబిస్ టీకా వేసుకోకపోవడంతో మృతిచెందినట్లు విచారణలో తెలిసిందన్నారు. అందువల్ల ప్రజలు కుక్క కరిచిన వెంటనే రాబిస్ టీకా వేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఈ టీకా ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. రాబిస్ ఒక ప్రాణాంతక వైరల్ వ్యాధి అని, రాబిస్ కుక్క కాటు వలన మాత్రమే కాదని, పిల్లులు, మేకలు, ఆవులు సహా పెంపుడు జంతువుల నుంచి సోకే అవకాశముందని ఆరోగ్యశాఖ డైరెక్టర్ తెలిపారు.

కుక్కలబండిలో ఎక్కమంటారా?

● పోలీసులపై బీజేపీ నేత ఆగ్రహం



పోలీసులతో గొడవపడుతున్న హెచ్ రాజా

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్‌లో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ నుంగంబాక్కంలోని ఆ సంస్థ ప్రధానకార్యాలయం ముట్టడించేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించారు. పోలీసుల అనుమతి లేకుండా నిరసన ర్యాలీలు చేస్తున్న పార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ సీనియర్ నేత నుంగంబాక్కం టాస్మాక్ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల బెదిరింపులకు భయపడనంటూ ఆయన ముందుకు కదిలారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్టు చేసి పోలీసుల వ్యాన్‌లో ఆయనను ఎక్కించేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన హెచ్ రాజా తనను కుక్కల వ్యాన్‌లో తీసుకెళతారా అని వారిపై మండిపడ్డారు. ఆ వ్యాన్ పోలీసుల వ్యాన్ అని ఎంతచెప్పినా ఆయన వినలేదు. చివరకు పోలీసులు అతడిని బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించి తరలించారు.

ఈడీని సాధనంలా వాడుకుంటున్న బీజేపీ

● మంత్రి రఘుపతి

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగం (ఈడీ)ని ఒక సాధనంగా వాడుకుంటోందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి ఆరోపించారు. నగరంలో సోమవారం మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ... బీజేపీ రహిత పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఐటీ, ఈడీతో ప్రతీకార చర్యలకు పాల్పడుతోందన్నారు. ఈడీ తనిఖీలు చేసి సుమారు వారం రోజులు దాటినా, ఇప్పటివరకు రూ.1,000 కోట్ల అవినీతి జరిగిందనే ప్రకటనకు సంబంధించి ఎలాంటి ఆధారాలు విడుదల చేయలేదన్నారు. ఢిల్లీలో చేసినట్లు రాష్ట్రంలో కూడా ప్రతీకార రాజకీయాలు చేపట్టాలనే బీజేపీ కలలు ఫలించబోవన్నారు. రాష్ట్ర ప్రజలు విజ్ఞత కలిగిన వారని, వారు బీజేపీ కపట ప్రేమను అంగీకరించరని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి రూ.100 కోట్లను కేంద్రం విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్రానికి నిధులు కేటాయించని కేంద్ర ప్రభుత్వాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టేందుకు రాష్ట్ర బీజేపీ సిద్ధమా అంటూ ప్రశ్నించారు. ఒకవేళ వారు అలా పోరాడితే సింగిల్ డిజిట్ నుంచి డబుల్ డిజిట్‌కు చేరే అవకాశముందన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వంలో ఎలాంటి తప్పులు జరిగే పరిస్థితి లేదని మంత్రి స్పష్టం చేశారు.

22 వరకు మోస్తరు వర్షాలు

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న ఉపరితల ఆవర్తనం కారణంగా కొన్ని ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఒకటి, రెండు ప్రాంతాల్లో ఈ నెల 22వ తేది వరకు మోస్తరు వర్షాలు కురువనున్నాయి. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... అదే సమయంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 డిగ్రీల వరకు అధికంగా నమోదవుతాయని, ఈ నెల 20వ తేది వరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని తెలిపింది. రాజధాని నగరం చెన్నైలో కొంత వరకు ఆకాశం మేఘావృతంగా ఉంటూ పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 25-26 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశముందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది.

పుదువైలో కలైంజర్‌కు విగ్రహం

● సీఎం రంగస్వామి హామీ

అడయార్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధికి పుదుచ్చేరిలో విగ్రహాన్ని పెట్టి తగిన గౌరవం కల్పిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న పుదువై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం డీఎంకే సభ్యుడు అనిపాల్ కెన్నడి అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిస్తూ, కలైంజర్‌కు విగ్రహంతో కూడిన మణిమండపాన్ని పుదుచ్చేరిలో నిర్మిస్తామనే విషయాన్ని ఈ ప్రభుత్వం తరపున హామీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు.

ఇద్దరు మంత్రులపై కేసుల రద్దు

ప్యారీస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రులు పెరియకరుప్పన్, ఎస్ఎస్ శివశంకర్‌లపై నమోదైన కేసులను మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. 2018వ సంవత్సరంలో అధికారంలోవున్న అన్నాడీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేయాలని డీఎంకే అధిష్టానం పిలుపునిచ్చింది. ఆ మేరకు అనుమతిలేకుండా ధర్నాలో పాల్గొన్న ఎస్ఎస్ శివశంకర్ సహా పలువురిపై అరియలూరు పోలీసులు రెండు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. అదేవిధంగా గత ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 10గంటల అనంతరం ప్రచారంలో పాల్గొన్న శివశంకర్ మరో కేసునమోదైంది. అదేవిధంగా 2021వ సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘించారని మంత్రి పెరియకరుప్పన్‌పై శివగంగ జిల్లా కండవరాయన్‌పట్టి పోలీసులు కేసునమోదు చేశారు. ఈ కేసులను రద్దుచేయాలని కోరుతూ, ఆ ఇద్దరి మంత్రుల తరుపున హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయమూర్తి జీకే.ఇళందిరియన్ మంత్రులపై నమోదైన కేసులను రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

టాస్మాక్ అవినీతిపై సీబీఐ విచారణ

● అన్బుమణి డిమాండ్

పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్‌లో రూ.వెయ్యి కోట్ల అవినీతి వ్యవహారంపై సీబీఐ విచారణ చేపట్టాలని పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి రాందాస్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... టాస్మాక్ అవినీతిపై వ్యతిరేకంగా ఆందోళన చేపడతామని అన్నామలై ప్రకటన చేసిన వెంటనే, బీజేపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. డీఎంకే అవినీతికి పాల్పడక పోతే ఉద్యమాలను అణిచివేసే చర్యలు మాని, టాస్మాక్ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఉత్తర్వులు జారీచేయాలని డా.అన్బుమణి డిమాండ్ చేశారు.

బీజేపీ ఆందోళనకు డీపీఐ మద్దతు

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ అవినీతిని ఖండిస్తూ బీజేపీ జరిపిన ఆందోళనకు తమపార్టీ మద్దతు ఇస్తుందని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ పేర్కొన్నారు. చెన్నై విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ టాస్మాక్ దుకాణాలు మూతపడాలని, సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయాలని తమ పార్టీ ఎప్పటి నుండో కోరుతోందని చెప్పారు. మద్య నిషేధానికి మద్దతుగా ఏ పార్టీ ఆందోళన జరిపినా తమకు అంగీకారమేనని చెప్పారు.

31లోగా నీటి పన్ను చెల్లించాలి

ప్యారీస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తాగునీరు, డ్రైనేజీ కనెక్షన్ ఉన్న వారు ఈ నెల 31వ తేదీలోగా పన్ను చెల్లించాలని చెన్నై మెట్రోపాలిటన్ వాటర్ సప్లై బోర్డు (సీఎండబ్ల్యూఎస్‌బీ) సూచించింది. వినియోగదారులు తాగునీరు, డ్రైనేజీ కనెక్షన్లకు సంబంధించిన పన్నును చెన్నై మెట్రోపాలిటన్ వాటర్ సప్లై బోర్డు నుండి పొందిన క్రెడిట్, డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా చెల్లించవచ్చని తెలిపింది. నగరంలో ఏర్పాటుచేసిన వాటర్‌బోర్డు కౌంటర్లలో ఈ నెల 31వ తేదీ పన్ను చెల్లించాలని లేని పక్షంలో సప్లై నిలిపివేయడంతో పాటు జప్తు చర్యలు కూడా ఉంటాయని చెన్నై మెట్రోపాలిటన్ వాటర్ సప్లైబోర్డు తెలియజేసింది.

దర్శకుడు కావాలనే నిర్మాతగా ప్రవేశించా!

● 'టెస్ట్' డైరెక్టర్ ఎస్.శశికాంత్



నయనతారకు సూచనలిస్తున్న శశికాంత్

సినిమా దర్శకుడు కావాలనే లక్ష్యంతోనే తాను నిర్మాతగా అరంగేట్రం చేశానని 'టెస్ట్' డైరెక్టర్, 'వై నాట్ స్టూడియోస్' అధినేత ఎస్.శశికాంత్ వెల్లడించారు. 'కాదలిల్ సొదప్పువదు ఎప్పడి', 'కావియ తలైవన్', 'ఇరుదిచుట్రు', 'విక్రమ్ వేదా' వంటి పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన శశికాంత్.. ఇపుడు 'టెస్ట్' అనే చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఏప్రిల్ 4వ తేదీ నెట్‌ఫ్లెక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యే ఈ చిత్రంలో ఆర్.మాధవన్, సిద్ధార్థ్, నయనతార, మీరా జాస్మిన్ తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు. ఈ నేపథ్యంలో తన తొలి దర్శకత్వ అనుభవాలను దర్శక నిర్మాత శశికాంత్ తాజాగా మీడియాతో పంచుకున్నారు.

? 'టెస్ట్' మూవీలో పెద్ద స్టార్లున్నప్పటికీ ఓటీటీలో ఎందుకు రిలీజ్ చేస్తున్నారు.

! ఇది నూతన దర్శకుడి చిత్రం. అనేక ప్రపంచ దేశాల్లో చందాదారులను కలిగిన నెట్‌ఫ్లెక్స్ వంటి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో తొలి చిత్రం రిలీజ్ కానుండటం నాకు దక్కిన భాగ్యంగా భావిస్తున్నాను. ఈ సినిమా ఒకే రోజు ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయాలని అనుకున్నాను. దానికోసమే నెట్‌ఫ్లెక్స్‌లో రిలీజ్ చేస్తున్నాను.

? నిర్మాతగా హిట్ చిత్రాలను నిర్మించిన మీరు దర్శకత్వం వైపు ఎలా వచ్చారు.

! దీనికి ఓ పెద్ద కథే వుంది. నేను ఒక ఆర్కిటెక్ట్‌ను. సినిమాలో కథలు చెప్పాలన్న బలమైన కోరిక ఉంది. ఇందుకోసం ప్రతి పనిని పద్ధతిగా నేర్చుకోవాలి కదా. అందుకే ముందుగా నిర్మాతనయ్యాను. ఒక్కో చిత్ర నిర్మాణం పూర్తయిన తర్వాత తదుపరి చిత్రానికి దర్శకత్వం వహించాలని అనుకునేవాడిని. కానీ, ఆలస్యమవుతూ వచ్చింది. ఈ క్రమంలో 12 యేళ్ళ క్రితం రాసిన 'టెస్ట్' స్టోరీతో దర్శకుడిగా మారాలనుకున్నాను. లాక్‌డౌన్ సమయంలో బూజుపట్టిన ఆ కథా పుస్తకాన్ని బయటకు తీసి అనేక మార్పులు చేశాను. అలా టెస్ట్ స్క్రిప్టు సిద్ధం చేసుకుని, ఇపుడు దర్శకుడిగా మారాను.

? క్రికెట్ క్రీడా నేపథ్యంలో సాగే చిత్రమా.

! కానేకాదు. కానీ, క్రికెట్ ఉంది. ప్రతి ఒక్కరికీ ఒక్కో పరీక్షా సమయం వస్తుంది. ఈ సినిమాలో ముగ్గురు అలాంటి క్లిష్టపరిస్థితులు ఎదురవుతాయి. ఆ పరీక్ష (టెస్ట్) ఏమిటన్నదే ఈ చిత్ర కథ. ఇందులో టెస్ట్ క్రికెట్ అంశాలు కూడా ఉన్నాయి. భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతున్నట్టుగా చూపించాం. ఈ మ్యాచ్‌లో సిద్ధార్థ్ మినహా 22 మంది రంజీ క్రికెటర్లు నటించారు.

? నయనతార ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?

! ఈ స్క్రిప్టు ప్రకారం తొలుత ఎంపిక చేసింది సిద్ధార్థ్‌నే. కథ రాసుకునే సమయంలోనే అర్జున్ పాత్ర సిద్ధార్థ్‌తో చేయాలని నిర్ణయించుకున్నాను. హీరోయిన్ పాత్ర రాస్తున్నపుడు నయనతారను మనసులో అనుకుని మొదలుపెట్టాను. నాకు తెలిసిన వారికి కూడా ఇందులోని కుముద పాత్ర గురించి ఫోనులో చెప్పాను కూడా. కొన్ని అంశాలు రియల్ క్యారెక్టర్‌తో పాటు ఈ సినిమాలోని పాత్రకు దగ్గరగా ఉండటంతో నటించేందుకు నయనతార అంగీకరించారు. మాధవన్‌ను ఒప్పించేందుకు చాలా సమయం పట్టింది. స్క్రిప్టును మరింతగా మెరుగు పరచాలని ఒత్తిడి చేశాడు.

? గాయని శక్తి గోపాల్‌ను సంగీత దర్శకురాలిగా పరిచయం చేయడానికి కారణం.

! ఆమె నాకు చాలా సంవత్సరాలుగా తెలుసు. ఆమె కూడా ఆర్కిటెక్టే. ఆమెకు నేను ప్రొఫెసర్‌గా ఉన్నాను. ఆమె కొన్ని సినిమాల్లో పాటలు పాడారు. ఆమె ప్రతిభ గురించి బాగా తెలుసు. నాకు పాటల కంటే నేపథ్య సంగీతం ముఖ్యం. ఈ స్క్రిప్టు ప్రారంభించినప్పటి నుంచి ఆమె నాతో కలిసి ప్రయాణం చేస్తున్నారు. 'టెస్ట్' మూవీకి మంచి సంగీతం అందించారు.

కేబీ జగన్ హీరోగా 'రోజా మల్లి కనకాంబరం'



పూజా కార్యక్రమం

సినీ దర్శకుడు, నటుడు కేబీ జగన్ హీరోగా 'రోజా మల్లి కనకాంబరం' అనే పేరుతో కొత్త చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమా షూటింగ్ సోమవారం తిరుచ్చెందూరులోని ఓ ఆలయంలో పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. 'పుదియ గీతై', 'కోడంబాక్కం', 'రామన్ తేడియ సీతై' వంటి చిత్రాలను రూపొందించిన కేబీ జగన్ యధార్థ సంఘటన ఆధారంగా 'రోజా మల్లి కనకాంబరం' మూవీ రూపొందిస్తున్నారు. కుటుంబ సమేతంగా ఆదరించి 'మాయాండి కుడుంబత్తార్' అనే విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిన యునైటెడ్ ఆర్ట్స్ పతాకంపై ఎస్‌కే సెల్వకుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం, టైటిల్ టీజర్ షూటింగ్ తిరుచ్చెందూరు సమీపంలోని శాస్తా ఆలయంలో జరిగింది. ఈ సినిమాలో ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటిస్తామని చిత్ర బృందం తెలిపింది. సినిమా గురించి దర్శకుడు కేబీ జగన్ మాట్లాడుతూ, 'నా జీవితంలో ఓ యధార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమా తెరకెక్కిస్తున్నాం. ఇందులో నేనే హీరోను. అన్ని వర్గాల అభిమానులను ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది' అని పేర్కొన్నారు.

'స్వీట్‌హార్ట్' బృందానికి యువన్ శంకర్‌రాజా అభినందనలు

రియో రాజ్ - గోపికా రమేష్ జంటగా నటించిన 'స్వీట్‌హార్ట్' మూవీ ఇటీవల విడుదలై విజయం సాధించింది. ఈ చిత్రం సక్సెస్‌ను పురస్కరించుకుని ఆ చిత్ర నిర్మాత, సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజా చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 14న విడుదలైన ఈ మూవీకి ప్రేక్షకాదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో మ్యూజిక్ వర్క్ కోసం విదేశాల్లో ఉన్న చిత్ర నిర్మాత



'స్వీట్‌హార్ట్' చిత్ర బృందంతో యువన్ శంకర్ రాజా

యువన్ శంకర్ రాజా చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'స్వీట్‌హార్ట్' సినిమా ప్రేక్షకాదారణ పొందింది. సినిమా చూసి ఎంజాయ్ చేసిన వారు కూడా సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారన్నారు. ప్రేమికుల మధ్య ఏర్పడే ఘర్షణలు, విభేదాలు, ఎడబాటు, భావోద్వేగం వంటి అంశాలతో ఈ సినిమాను డైరెక్టర్ స్వినీత్ ఎస్.సుకుమార్ దర్శకత్వం వహించారు.

తమిళ చిత్రజ్యోతి

దర్శకుడి నమ్మకం నిజమైంది

● కయదు లోహర్



తన విషయంలో దర్శకుడు అశ్వత్ మారిముత్తు నమ్మకం నిజమైందని హీరోయిన్ కయదు లోహర్ అంటున్నారు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా వచ్చిన 'డ్రాగన్' మూవీలోని ఇద్దరు హీరోయిన్లలో ఒకరిగా కయదు నటించారు. ఆ సినిమా కోసం మొదట చెప్పిన పాత్ర లోకాకుండా, మరో పాత్రను దర్శకుడు కేటాయించారు. దీనిపై కయదు స్పందిస్తూ, 'పాత్రను మార్చానని బాధపడొద్దు. ఇందులో ఇద్దరు హీరోయిన్లు అయినప్పటికీ 'డ్రాగన్' మూవీతో పాటు 'పల్లవి' పాత్ర ఎంతో ముఖ్యమైనవి. ఈ చిత్రంతో పాటు ఆ పాత్ర నీ సినీ కెరీర్‌కు మలుపురాయిగా ఉంటుందని దర్శకుడు గట్టిగా నాతో చెప్పారు. ఆయన చెప్పినట్టుగానే ఈ చిత్రం ఘన విజయం సాధించడంతో పాటు నాకూ మంచి పేరు వచ్చింది. ఈ తరుణంలో దర్శకుడు అశ్వత్, హీరో ప్రదీప్ రంగనాథన్‌కు జీవితాంతం రుణపడివుంటా' అన్నారు.



చెన్నై సచివాలయంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ పథకాలపై మంత్రి దామో అన్బరసన్, అధికారులతో సమీక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

ఒప్పిలియప్పన్ ఆలయంలో పంగుణి ఉత్సవాల ప్రారంభం



ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో ఒకటైన తంజావూరు జిల్లా కుంభకోణం సమీపం తిరునాగేశ్వరం ఒప్పిలియప్పన్ ఆలయంలో పంగుణి ఉత్సవాలు సోమవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ముందుగా ఉత్సవ మూర్తి భూదేవి సమేత పొన్నప్పర్ ప్రత్యేక అలంకరణతో ధ్వజస్తంభ మంటపానికి వేంచేశారు. ఆ తర్వాత భట్టాచార్యులు వేదమంత్రాలను పఠిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధానార్చకులు ధ్వజ పతకాన్ని ఎగరువేశారు. ఈ వేడుకలు 12 రోజుల పాటు జరుగనున్నాయి. ప్రతిరోజూ పెరుమాళ్, తాయర్ వివిధ అలంకారాల్లో ఆలయ వీధుల్లో వాహనాల్లో ఊరేగనున్నారు. ఈ వేడుకలలో ప్రధానఘట్టమైన రథోత్సవం ఈ నెల 25న జరుగనుంది. ఆ తరవాఆత అహోరాత్ర పుష్కరిణిలో తీర్థవారీ వేడుకలు, ఉత్సవర్ల తిరుమంజనం, అన్న పెరుంపడయల్ (కుంభాకారంలో అన్న ప్రసాదనైవేద్యం) పుష్పయాగం తదితర వేడుకలను నిర్వహించనున్నారు.

నేషనల్ వాలీబాల్ పోటీలకు దేవకోట విద్యార్థి ఎంపిక



వీరమణికంఠన్

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం తరపున జాతీయ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జట్టులో దేవకోట పాఠశాల విద్యార్థికి స్థానం లభించింది. దిండుగల్‌లో రాష్ట్ర జూనియర్ వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. రాష్ట్రం నలుమూలల నుండి 91 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా దేవకోట నగరత్తార్ మహోన్నత పాఠశాల ప్లస్- 2 విద్యార్థి వీరమణికంఠన్, మరికొందరు ఎంపికయ్యారు. వీరమణికంఠన్ రాష్ట్ర జట్టు తరఫున ఈ నెల 26నుండి 30 వరకు బిహార్‌లో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలో పాల్గొననున్నాడు. ఈ విషయం తెలుసుకున్న శివగంగ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వీరమణికంఠన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు.

కుమరి అనంతన్‌కు అస్వస్థత

అపోలో ఆస్పత్రిలో చికిత్స



కుమరి అనంతన్

టి.నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు తెలంగాణా మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తండ్రి కుమరి అనంతన్ తీవ్ర అస్వస్థతకు గురై వానగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కుమరి అనంతన్ వృద్ధాప్య సమస్యల కారణంగా గుడియాత్తం కాక్కాతోప్పు ప్రాంతంలోని ప్రకృతి యోగా చికిత్సాలయంలో గత కొద్ది నెలలుగా చికిత్స పొందుతున్నారు. ఇటీవల ఆయన ఆరోగ్యపరిస్థితి క్షీణించడంతో వేలూరులోని నరువి ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ నేపథ్యలో శనివారం రాత్రి ఆయనకు శ్వాసపీల్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం చెన్నై సమీపం వానగరంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యనిపుణులు చికిత్స అందిస్తున్నారు.

వర్షపు నీరు నిల్వచేసేలా రూ.350 కోట్లతో కొత్త రిజర్వాయర్

● కోవలం సమీపంలో 4,375 ఎకరాల్లో ఏర్పాటు



పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షపు నీరు నిల్వచేసేలా కోవలం సమీపంలో 4,375 ఎకరాల్లో రూ.350 కోట్లతో కొత్త రిజర్వాయర్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నగర జనాభా రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, తాగునీటి కొరత తీర్చేందుకు తిరుపోరూర్ తాలూకా కోవలం సమీపం పాత మహాబలిపురం రోడ్డు, ఈసీఆర్ మధ్య 4,375 ఎకరాల్లో ఆరో రిజర్వాయర్ ఏర్పాటు చేయనున్నారు.. ఈ రిజర్వాయర్ ద్వారా నగరవాసులకు ఏటా 170 ఎంఎల్డీ తాగునీరు అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలో నీటివనరులు పరిరక్షణ, మెరుగుపరిచేందుకు రూ.2,000 కోట్లతో సమీకృత జలవనరుల అభివృద్ధి ప్రాజెక్ట్ వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలుచేయనున్నారు. ఈ పథకం కింద, కొత్త నీటిపారుదల ప్రాంతాల పరిశోధన, నిర్మాణం, ఇప్పటికే ఉన్న జలాశయాల పునరుద్ధరణ, నీటి సామర్థ్యం పెంపు తదితరాలు చేపట్టాలని నిర్ణయించి, ప్రస్తుత బడ్జెట్‌లో జలవనరుల శాఖకు రూ.9,460 కోట్లు కేటాయించారు.

'జిప్ లైన్'పై వేలాడుతూ సాహసం

● పర్యాటకుల ఆసక్తి



పెరంబూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కూడలూరులో జీన్‌పూల్ బొటానికల్ సెంటర్‌కు వచ్చి 'జిప్ లైన్'లో వేలాడుతూ సాహసం చేసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. నీలగిరి జిల్లా కూడలూరు ప్రాంతంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేలా, రాష్ట్ర జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పుల హరిత కార్యక్రమం కింద రూ.1.7 కోట్లతో జీన్‌పూల్ ఎకో టూరిజం ప్లాంట్ సెంటర్‌లో పలు వినోదభరిత కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అందులో భాగంగా, పర్యాటకులు జిప్ లైన్‌పై వేలాడే సాహస కార్యక్రమం రూపొందించారు. తొలుత, ప్రాణభయంతో పర్యాటకులు ఈ సాహసం చేసేందుకు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు చేపట్టిన అవగాహనతో జిప్ లైన్ సాహసం చేసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

● మహిళా దినోత్సవంలో వక్తలు



సన్ టీవీ ఫేమ్ కార్తికా రాజన్‌ను సన్మానిస్తున్న దివ్యా బాలాజీ, శైలశ్రీ తదితరులు

ప్యారీస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ప్రతిచోటా పురుషులతో సమానంగా గౌరవాన్ని అందుకోగలిగినప్పుడే సమాజం నిర్మాణాత్మ పురోభివృద్ధి సాధిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ502ఏ ఆధ్వర్యంలో 'మహిళారత్నాలు' పేరుతో ఎస్కేపీడీ కన్వెక్షన్ హాలులో ఆదివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్ట్ ఛైర్మెన్ దివ్యా బాలాజీ అధ్యక్షత వహించగా, జిల్లా గవర్నర్ సీఎం రాజేష్, శైలశ్రీ దంపతులు క్లబ్ ఆధ్వర్యంలో సమాజానికి అందిస్తున్న సేవలను వివరించారు. ముఖ్యఅతిథులుగా సన్ టీవీ ఫేమ్ కార్తికా రాజన్, కుమరవేల్, చిత్ర దంపతులు హాజరై వివిధ రంగాల్లో రాణిస్తున్న తొమ్మిది మంది మహిళలను నిర్వాహకులతో కలిసి ఘనంగా సత్కరించారు. సుమారు 400 మంది మహిళలతో ఆటపాటలు, నృత్యాలు, క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలతో 'మహిళారత్నాలు' కార్యక్రమం సందడిగా సాగింది.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో 21న ఇఫ్తార్ విందు

● ఈపీఎస్ ప్రకటన

ప్యారీస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆధ్వర్యంలో 21వ తేదీ శుక్రవారం ఇఫ్తార్ ఇందు ఏర్పాటు చేయనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రతిఏటా ఉపవాస దీక్షల్లో పాల్గొంటున్న ముస్లిం సోదరుల్లో కొంతమందిని ఇఫ్తార్ విందుకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా శుక్రవారం సాయంత్రం 5.30గంటలకు ఎగ్మూర్‌లోని బుహారీ సిరాజ్ హాలులో నిర్వహించనున్న ఇఫ్తార్ విందులో ముస్లింలు, పార్టీ రాష్ట్రస్థాయి నిర్వాహకులు, మైనార్టీ విభాగం కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా ఈపీఎస్ పిలుపునిచ్చారు.

పింఛన్ పెంచాలని కోరుతూ రిటైర్డ్ పోలీసుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న రిటైర్డ్ పోలీసులు

ప్యారీస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు శాఖలో రిటైర్ అయిన ఉద్యోగులకు 70శాతం అదనంగా పింఛన్ ఇవ్వాలని కోరుతూ కన్నియాకుమారి జిల్లాలో సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లాలోని నాగర్‌కోయిల్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో రిటైర్డ్ పోలీసు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో వంద మందికి పైగా పాల్గొన్నారు. పదవీవిరమణ పొందిన పోలీసులు మరణిస్తే ప్రస్తుతం ఇచ్చే ఆర్థికసాయం రూ.50వేలను రూ.2 లక్షలకు పెంచాలని తదితర 12 డిమాండ్లను నెరవేర్చాలని రిటైర్డ్ పోలీసులు డిమాండ్ చేశారు.

అటు దిగుబడి ... ఇటు ధరలు

● విరుదునగర్ సీమచింత రైతుల్లో ఆనందం



రైతు చిన్నపాండి

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విరుదనగర్ జిల్లాలో ఈ యేడాది వందెకరాలకు పైగా విస్తీర్ణంలో సీమచింతను పండించిన రైతులు ప్రస్తుతం తమ ఉత్పత్తులకు అధిక ధర రావడంతో సంతోషపడుతున్నారు. ఓ వైపు దిగుబడి పెరగడం, మరో వైపు కేజీ సీమచింత కాయల ధర రూ.350లకు పలుకుతుండడంతో రైతులు ఈ యేడాది తమ పంట పండిందని హర్షం ప్రకటిస్తున్నారు. సీమ చింతకాయలు వేసవిలో ఉష్ణాన్ని తగ్గిరచడమే కాకుండా ఉదర సమస్యలను తొలగిస్తుందని ఇలాంటి ఔషధగుణాలు కలిగి ఉండటం వల్లే ప్రజలు వీటిని అధికంగా కొనుగోలు చేస్తారని రైతులు చెబుతున్నారు. గత యేడాది కోత సమయంలో భారీగా వర్షాలు కురవటంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రస్తుతం ఆ నష్టం నుండి బయటపడేలా సీమచింత ధర అధికంగా ఉండడటం ఆనందాన్ని కలిగిస్తోందని రైతులు పేర్కొన్నారు. ఈ విషయమై రైతు చిన్నపాండి మాట్లాడుతూ పదెకరాల్లో సీమచింత సాగు చేస్తున్నానని, రోజుకు 100 కేజీల వరకు దిగుబడి వస్తోందని తెలిపారు. బిందు సేద్యం ద్వారా సీమచింత పండిస్తున్నట్లు చెప్పారు. మాసి, పంగుణి, చిత్తిరై (ఫిబ్రవరి నుండి ఏప్రిల్ దాకా) మంచి దిగుబడి లభిస్తుందని చెప్పారు.



పార్క్ ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

నుంగంబాక్కంలో ఉద్యానవనం ప్రారంభం

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కంలో కార్పొరేషన్ పార్కును ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సోమవారం ప్రారంభించారు. నమక్కునామే పథకంలో ఎంటీబీ వైష్ణవ మహిళా కళాశాల ఆధ్వర్యంలో రూ.30లక్షలతో చేపట్టిన మరమత్తులతో కొత్త అందాలను సంతరించుకున్న ఈ పార్కు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, శాసనసభ్యుడు ఎన్.ఎళిలన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ జే కుమారగురుబరన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రయాణం.. భవిష్యత్‌కు నాంది



స్నాతకోత్సవంలో డిగ్రీలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

అడయార్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పట్టాలు అందుకోవడమంటే విద్యా ప్రయాణం ముగిసినట్టు కాదని భవిష్యత్‌కు నాందిగా భావించాలని మౌంట్ రోడ్డు బిలాల్ వ్యవస్థాపకుడు కె.అబ్దుల్ రహీం అన్నారు. సీకే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, సీకే కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ 2025 గ్రాడ్యుయేషన్ డే వేడుకలు తాజాగా కడలూరు జిల్లాలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో 551 మంది ఇంజనీరింగ్, 148 మంది ఎంబీఏ, 299 మంది బీఎడ్ గ్రాడ్యుయేట్‌లకు డిగ్రీలు ప్రదానం చేశారు. అలాగే, పది మంది యూనివర్సిటీ ర్యాంకు హోల్డర్లు కూడా డిగ్రీ పట్టాలు అందుకున్నారు. ఇందులో ముఖ్య అతిథిగా అబ్దుల్ రహీం పాల్గొని డిగ్రీలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కెవిన్‌కేర్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీకే రంగనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అముదవల్లి, సీకే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జీవనశైలిలో వేదాల అనుసరణ

● కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేద రక్షణతోనే లోక రక్షణ సాధ్యమవుతుందని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో సోమవారం దక్షిణాది రాష్ట్రాల వేద సమ్మేళనాన్ని వర్చువల్ ద్వారా ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగే కార్యక్రమంలో శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం చేశారు. భారతీయ జీవన శైలి వేదాలను అనుసరించి ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచీ వేదపరిరక్షణ చర్యలు అవసరమన్నారు. జ్యోతిషం, పురాణాలు, ఇతిహాసాలు, నీతి, యోగ శాస్త్రాలను వేదాలతో అనుసంధానించాలన్నారు. వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, ఉజ్జయినిలోని సాందీపని రాష్ట్రీయ వేద విద్యా ప్రతిష్ఠానం కార్యదర్శి విరుపాక్ష జడ్డిపాల్‌లు మాట్లాడుతూ.. వేద పరిరక్షణ అందరి కర్తవ్యమన్నారు. మంచి జీవన విధానాన్ని అనుసరించడం ద్వారా గొప్ప ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రజల్లో ధార్మిక చైతన్యం పెరగాలన్నారు. ప్రతి ఇంట్లో వేద పారాయణం, గో సంరక్షణ చేపట్టాలన్నారు. అమలధారి సింహ సంకలనం చేసిన 'వేద కల్పవృక్ష', 'వేద మహార్ణవ' అనే గ్రంథాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేద వర్సిటీ రిజిస్ట్రార్ భాస్కరుడు, పలు ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.



వేద సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న విరుపాక్ష జడ్డిపాల్, చిత్రంలో వేదవర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి తదితరులు

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.46 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,721
తలనీలాలు సమర్పించినవారు: 27,261



పారని చోరుల పన్నాగం

దొంగను పట్టించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ ● పరారీలో మరో నిందితుడు





పట్టుబడిన మహ్మద్ సయ్యద్ ఇబ్రహీం - ఇంట్లో చోరీకి యత్నిస్తున్న లక్ష్మణ్

తిరుచానూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పథకం ఫలించింది. ఓ దొంగను పట్టించింది. తిరుచానూరు నుంచి నారాయణాద్రి ఆస్పత్రికి వెళ్లే మార్గంలో పీజీ గార్డెన్స్‌లో విశ్రాంత ఉద్యోగి రోశబ్బ ఉంటున్నారు. రెండు రోజుల క్రితం కుటుంబంతో వేరే ఊరికి వెళ్లారు. వెళ్లేముందు ఆయన పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఆ ఇంటికి లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో సోమవారం వేకువజామున ఇద్దరు దొంగలు రోశబ్బ ఇంట్లోకి చొరబడ్డారు. వారు చోరీకి యత్నిస్తుండగా ఎల్‌హెచ్‌ఎంఎస్ పోలీసు కంట్రోల్‌రూమ్‌ను అప్రమత్తం చేసింది. దీంతో కొద్ది నిమిషాల్లోనే సీఐ సునీల్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి, బ్లూకోల్ట్ సిబ్బంది పూర్ణచంద్రరావు, శ్రీనివాసులు ఆ ఇంటికి చేరుకున్నారు. చాకచక్యంగా లోనికి ప్రవేశించారు. ఈలోగా వీరి అలికిడికి ప్రధాన నిందితుడు లక్ష్మణ్ ఇంటి వెనుక నుంచి తప్పించుకున్నాడు. అతనితో వచ్చిన సయ్యద్ ఇబ్రహీం మాత్రం పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతను తమిళనాడులోని కడలూరుకు చెందిన వాడు. లక్ష్మణ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఇతనిది తమిళనాడులోని కల్లకుర్తి. కాగా నిందితుల కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కత్తులు, రాడ్లు ఉన్నట్లు తెలిసింది. ప్రధాన నిందితుడు ఏపీ,తమిళనాడుల్లో పలు చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఊళ్లకు వెళ్తున్నప్పుడు ఇంటి యజమానులు సమాచారమిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ అనుసంధానం చేస్తామని పోలీసులు చెప్పారు. తాజాగా సయ్యద్ ఇబ్రహీం ఇలాగే పట్టుబడ్డాడని తెలిపారు.

శేషాచలం జీవ వైవిధ్యానికి నెలవు

బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, విజయ్‌కుమార్ తదితరులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవులు జీవ వైవిధ్యానికి నెలవు అని ఏపీ బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శేషాచలం - జీవ వైవిధ్యం అంశంపై ఎస్వీయూ సెనెట్ హాల్లో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. శేషాచలాన్ని ఓ జీవ నిధిలా అభివర్ణించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజల సహకారం అవసరమన్నారు. తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చొద్దన్నారు. చిన్ననాటి నుంచే జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. బోధన, పరిశోధనల్లోనే జీవ వైవిధ్యం పట్ల ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. శేషాచలంలో కొన్ని జీవ జాతులు అంతరిస్తున్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. నగరాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు అవసరమన్నారు. డీఎఫ్‌ఓ వివేక్ మాట్లాడుతూ రాయలసీమలో నీటి వనరులున్న ఏ ప్రాంతమైనా జీవ వైవిధ్యంతో పాటు ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిందన్నారు. శేషాచలంలో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు అటవీ శాఖ తనవంతు పాత్ర పోషిస్తోందన్నారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు యూనివర్సిటీ తనవంతు సహకారం అందిస్తుందని తెలిపారు. తుడా కార్యదర్శి వెంకటనారాయణ, నవీన్‌కుమార్, బాలాజీ శ్రీవత్స, టీవీ రమణ, యూనివర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ నిర్మాణాల కోసం తిరుమలలో చెట్లను తొలిగించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ హరికృష్ణ పాకనాటి, అక్షర ఫౌండేషన్ అధినేత మద్దినేని హరిబాబు, బోటనీ అధ్యాపకులు డాక్టర్ కామాక్షమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుగుతూనే ఉన్నాం...

సమస్యలకు పరిష్కారం చూపండి

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల వేడుకోలు ● 250 వినతుల రాక

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'సార్ వారం వారం కలెక్టరేట్‌కు వస్తూనే ఉన్నాం.. అర్జీలు ఇస్తూనే ఉన్నాం.. మా సమస్యలు పరిష్కారం కావడం లేదు' అంటూ పలువురు అర్జీదారులు అధికారుల ఎదుట వాపోయారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించారు. మొత్తం 250 అర్జీలు అందగా అందులో 165 రెవెన్యూ శాఖకే ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ అర్జీలు స్వీకరించారు.



విద్యార్థి సంఘం నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



పింఛను కోసం తిరుగుతూనే ఉన్నా..

నాలుగేళ్ల క్రితం పక్షవాతంతో కాళ్లు చచ్చుబడిపోయాయి. కూలి పనులకు వెళ్లడానికి కూడా సాధ్యపడటం లేదు. కుటుంబ పోషణ కష్టంగా మారింది. మూడేళ్లుగా తిరుగుతూనే ఉన్నాం. కనికరించి పింఛను వచ్చే విధంగా చూడండి.

- కోటయ్య, కాశీపురం, వాకాడు

డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల కోసం డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ సెంటర్ లేకపోవడంతో ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. తద్వారా వారిపై ఆర్థికభారం పడుతోందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు అక్బర్, మల్లికార్జున, చిన్న, ఓంరాజ్, శివశంకర్‌నాయక్, సుందర్ పాల్గొన్నారు.

అంతర్గత పదోన్నతులు కల్పించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు ఉద్యోగులు

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ సిబ్బందికి అంతర్గత పదోన్నతులు కల్పించాలని ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్స్, ఔట్‌సోరింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఫీల్డ్ సిబ్బంది 17 ఏళ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకుని వారిని ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఇందులో పనిచేసే ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబానికి రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలని, సర్వీసు వెయిటేజీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యమిత్రలు కవిత, సాదికారెడ్డి, చంద్రమ్మ, సారిక, సురేఖ, జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి

రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు డీఏ బకాయిలు చెల్లించాలని, 2023 నుంచి అమలు చేయాల్సిన 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరామనాయుడు, సహాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ పెండింగ్ గ్రాట్యుటీ చెల్లింపునకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నగర ప్రధాన కార్యదర్శి వెంకటేశం శెట్టి, సభ్యులు అల్లా బక్షు, కృష్ణమూర్తి, శేఖర్, జగన్నాథనాయుడు, జయరాం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు

వైసీపీ కోఆర్డినేటర్ అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డిపై అసత్య ప్రచారాలు చేశారని నమోదైన కేసులో వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ చరణ్‌తేజను తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు... తిరుపతి రూరల్ పుదిపట్లకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చరణ్‌తేజ.. ఎమ్మెల్యే నాని, సుధారెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ తిరుపతి రూరల్‌కు చెందిన చింతకాని సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కారణంగా సోమవారం చెర్లోపల్లి-చంద్రగిరి రహదారిలోని పెట్రోలు బంకు వద్ద అతన్ని అరెస్టు చేశారు. మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ఈనెల 28వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

● తొలిరోజు 299 మంది గైర్హాజరు



పరీక్షా కేంద్రం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీలు



హాల్ టిక్కెట్ నెంబర్లను చూసుకుంటూ..



పరీక్షకు ముందు తల్లిదండ్రులతో వీడియో కాల్



పరీక్షా కేంద్రం వద్ద ఓ తల్లి సెల్ఫీ



తిరుపతి అర్బన్ జీవకోనలోని విశ్వం స్కూల్ వద్ద విద్యార్థులు



తల్లిదండ్రుల ఆశీర్వాదం

తిరుపతి(విద్య), మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 164 కేంద్రాల్లో తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 299 మంది గైర్హాజరయ్యారు. 26,803కుగాను 26,504 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తొలిరోజు పరీక్షకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కూడా పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు.ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల 7.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాలవద్దకు రావడం మొదలుపెట్టారు. మరోవైపు నగరంలోని ఆలయాల వద్ద విద్యార్థులు మొక్కుతూ కనిపించారు. పరీక్ష ప్రారంభమైన తరువాత కూడా కేంద్రాలవద్ద నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు వెళ్లకపోవడంతో కొన్ని చోట్ల పోలీసులు బలవంతంగా వారిని అక్కడినుంచి పంపించాల్సి వచ్చింది. పది పరీక్షలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టింది. అన్ని కేంద్రాలవద్ద గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని నాలుగు సమస్యాత్మక పరీక్ష కేంద్రాలవద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేశాకే కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను, ఇంటర్‌నెట్ సెంటర్లను ముందుగానే మూయించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి తీసుకువెళ్లకుండా జాగ్రత్త వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పది ఫ్లయింగ్ స్క్వాడ్లు కేంద్రాలను తనిఖీ చేశాయి. 30 మంది సిట్టింగ్ స్క్వాడ్లు ఆయా కేంద్రాల్లో ఉన్నాయి. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ లాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లకు నిధుల మంజూరు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : 2024-25 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో చేపట్టిన ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ● ఎస్వీయూ పరిధిలోని 160 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లకు రూ.32.64లక్షలు ● పద్మావతి వర్సిటీకి రూ.3,26,400 ● ద్రవిడ వర్సిటీకి రూ.1,22,400 ● ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి రూ.3,67,200 ● ఎస్వీ వేద విశ్వవిద్యాలయానికి రూ.40,800 ● జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి రూ.61,200 ● శ్రీసిటీ ట్రిపుల్ ఐటీకి రూ.61,200 ● చిత్తూరు అపోలో యూనివర్సిటీకి రూ.40,800 మంజూరయ్యాయి.

'కుప్పం'లో ఉపాధి పనులపై విజి'లెన్స్'

తిరుపతి(నేరవిభాగం), మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో కుప్పం నియోజకవర్గంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్సు అధికారులు దృష్టి పెట్టారు. ప్రాథమికంగా జిల్లా అధికారుల నుంచి రికార్డులు తెప్పించుకున్నారు. మండలాల వారీగా ఏటా ఎన్ని పనులు మంజూరయ్యాయి? ఎన్ని పూర్తి చేశారు? ఏఏ పనులకు బిల్లులు డ్రా చేశారనే కోణంలో దర్యాప్తు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. శాంతిపురం, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం మండలాల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అప్పట్లో అవినీతి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. వీటిపై కొందరు ఫిర్యాదులు కూడా చేసినట్లు తెలిసింది. ఓ ప్రజాప్రతినిధిపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఇష్టానుసారంగా పనులు చేసి, బిల్లులు డ్రా చేసి స్వాహా చేసినట్లు విమర్శలున్నాయి. వీటిపై విజిలెన్సు అధికారులు.. తొలుత రికార్డులను పరిశీలించనున్నారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో వీటిని పరిశీలించనున్నారు. ఇలా సమగ్ర దర్యాప్తునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ఫిర్యాదుదారులను స్టేషన్ల చుట్టూ తిప్పితే చర్యలు

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుంటి సాకులు చెప్పి ఫిర్యాదుదారులను పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పితే చర్యలు తప్పవని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. ఒకే సమస్యపై పదే, పదే వచ్చే వారిని విచారించి సంబంధిత అధికారులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్ కోసం ఇద్దరు అదనపు ఎస్పీలు, తొమ్మిది మంది సీఐలు, సిబ్బందిని నియమించామని గుర్తు చేశారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ఎక్కడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ప్రతి వారం తన దృష్టికి వస్తున్న సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్‌కు 92 ఫిర్యాదులు రాగా.. దాదాపు పదింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.